# మమతల పాలవెల్లి

డి. విజయలక్ష్మి

ఆకాశం నక్షత్ర తోరణాలతో అలంకరింపబడింది. మబ్బుల పరదాల మాటునుంచి రేరాజు వెన్నెల చిరునవ్వులు చిందిస్తూ తన సామ్రాజ్యమంతా కలియ తిరుగుతున్నాడు. చెట్లు నిద్ర మేల్కొని వెన్నెల గాలిని పీలుస్తూనిశ్శబ్ద గీతాలు పాడుతున్నాయి.

"అవును మరి. ఎన్ని పక్షి కూనలకి ఆశ్రయమిచ్చాయని. నిద్రాభంగం కలక్కుండా జాగ్రత్తపడొద్దూ'' అనుకుంది మనోజ్ఞ.

కాంటెస్సా కారు వెన్నెల పరుచుకున్న రోడ్డు మీద మెత్తగా సాగిపోతోంది. చల్లటి గాలి, తెల్లటి వెలుతురూ మనోజ్ఞముఖాన్ని చుంబిస్తూ కదలిపోతున్నాయి. ఖాళీగావున్న రోడ్డు మీద వెన్నెల్లో ప్రకృతి శోభల్ని తిలకిస్తూ మెల్లిగా ప్రయాణం చేయడం ఆమెకు చాలా ఇష్టం. కాని అవతల పెళ్లి ముహూర్తం దగ్గరపడుతుంది. కాస్త ముందుగానే వెళ్లి వుండవచ్చు. కానీ అందరూ హడావుడిగా వున్న సమయంలో వెళ్లాలని మనోజ్ఞ ఉద్దేశ్యం. వాళ్లంతటవాళ్ళు వచ్చి ఎలా పలకరిస్తారో చూడాలి. ఆమె కారు వేగాన్ని పెంచింది.

కళ్యాణమండపం రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరింపబడింది. అవి వెలుగుతూ, ఆరుతూ రక రకాల ఆకారాలు సంతరించుకుంటున్నాయి. బయట కొద్దిగా స్కూటర్లు ఆగివున్నాయి. పెళ్లి కొడుకు వచ్చింది కాబోలు ఒక కారు పువ్వులతో అలంకరింపబడింది. మనోజ్ఞకి కోపం, రవ్వంత బాధా కూడా కలిగాయి. మధ్యతరగతి కుటుంబీకులు. కాని పెళ్లి అనేటప్పటికి ఎంత భేషజం! ఎంత మందికి విందులు. వినోదాలు. దాని కోసం అప్పులు.

మనోజ్ఞకి ఇలాంటి పెళ్ళిళ్లకు వెళ్లడం ఇష్టం వుండదు. కానీ తను కలవాలనుకున్న వాళ్లంతా ఈ రోజు ఇక్కడే వుంటారు. రాక తప్పలేదు. పోనీ అదీ ఒక అనుభవం. కారు తాళంవేసి లోపలకు నడిచింది.

ఒక పక్క మిలటరీ బ్యాండు గట్టిగా ఏదో సినిమా పాట వాయిస్తున్నారు. మరో పక్క సన్నాయి బ్యాండు వాళ్లు నిశ్శబ్దంగా కూర్చున్నారు.

తెల్లవారుజామున పక్షుల కిల కిల రావాల మధ్య సన్నసన్నగా సన్నాయి రాగాలు, నాదస్వరం మీద 'హిమ గిరి తనయే' వాయిస్తుంటే ఓ పవిత్రతను ఆపాదించుకుని వీనులకెంత విందు చేస్తాయి! ఎందుకీ గందరగోళం?

మనోజ్ఞ ఓ పక్కగా కుర్చీలో కూర్చుని పందిరంతా పరికించి చూసింది.

జనం చాలామందే వున్నారు. గుంపులు గుంపులుగా కూర్చుని కబుర్లుచెప్పుకుంటున్నారు. కాస్త ముందుగానే మంత్రాలు చదివేసరికి పురోహితుడు ముహూర్త సమయం కోసం ఎదురు చూస్తూ పక్కన ఎవరితోనో రాజకీయాలు చర్చిస్తున్నాడు. తెర పట్టుకున్న పిల్లలిద్దరూ విసుక్కుంటూ ఆవలిస్తున్నారు.

పెళ్లి కొడుకు వెనక కూర్చున్నారు పరమేశ్వరం మావయ్యా, భార్య పార్వతి వాళ్ల పెళ్లి కొడుకు తల్లిదండ్రులు. వాళ్ల పక్కనే వుంది అనసూయ పిన్ని. మరో వైపు కాంతం అత్తయ్య, ఆవిడ కొడుకు రామం. వాళ్ల వెనక వున్నారు శ్రీలత, మనోజ్ఞ మరో పిన్ని కూతురామె. ఆమె భర్తా పిల్లలూ, అత్తగారూ.. మనోజ్ఞ చూడాలనుకుంది వీళ్లందరినే.

పురోహితుడు నాలుగోసారి గడియారం చూసుకుని "బాజాలు గట్టిగా" అని అరిచాడు. బాజాల వాళ్లు ఉలిక్కిపడి ఒక్కసారిగా వాయించడం మొదలుపెట్టడంతో అంతా గోలగా తయారయ్యింది. పురోహితుడి మంత్రాలు ఆ గోలలో కలిసిపోయాయి. వధూవరులు జీలకర్ర, బెల్లం తలమీద పెట్టుకోవడం పూర్తయ్యింది. పురోహితుడుఅక్షింతలు వేయగానే హాలు మూల మూలల నుంచి అక్షింతల వర్షం కురవసాగింది. ఏ పదిమందో తప్ప దగ్గరగా వెళ్లి, దీవించి వేసిన వాళ్ల లేరు. మధ్యలో కూర్చున్న వాళ్లుతలల మీద పడ్డ అక్షింతల్ని చిరాగ్గా దులుపుకుంటున్నారు. హాలంతా అక్షింతలే. పిల్లలు వాటిని తొక్కుతూనే తిరుగుతూ, ఆడుకుంటున్నారు. పరబ్రహ్మ స్వరూపం అన్నం కాని బియ్యం కాదేమో అనుకుంది మనోజ్ఞ.

వధూవరులు బట్టలు మార్చుకుందికి లోపలకు వెళ్లారు. అందరూ తిరిగి కబుర్లలో పడ్డారు. పరమేశ్వరం గారులేచి, వచ్చిన బంధువులని పలకరిస్తూ కాఫీలు త్వరగా పంపండి అని కేకలు పెడుతున్నారు. పక్కావిడతో బాతాఖానీ కొడుతున్న అనసూయ ఎవరెవరువచ్చారో అని పందిరంతా వెతుకుతోంది. మనోజ్ఞమీద కళ్లు పడగానే ఆమె కళ్లు ఆశ్చర్యంతో విచ్చుకున్నాయి. తెరిచిన నోరు అలాగే వుండిపోయింది. ఆమెను గమనించిన పరమేశ్వరంగారు ఆవిడ నాస్థితికి తీసుకొచ్చిన దశ్యం ఏమిటా అని పరికించి చూశారు. చూస్తున్నది కలో, నిజమో అర్థంకానట్లు బొమ్మలా నిలబడిపోయాడు. ముందుగా అనసూయ పిన్నే తేరుకుంది. ఉన్న పాటున లేచి అందరి కాళ్లు తొక్కుతూ హడావుడిగా దగ్గరకొచ్చింది.

''ఏమిటే మనూ.. నువ్వేనా, నేనుకలగనడం లేదుగా?' వచ్చి పక్క కుర్చీలో కూలబడింది.

" నేనే పిన్నీ, ఆశ్చర్యం దేనికి? పిలుపు అందింది వచ్చాను పెళ్లి కూతురి తరపున. నా స్నేహితురాలికి పెళ్లికూతురు చెల్లెలవుతుంది. శుభలేఖలో 'బంధుమిత్ర సపరివారంగా' అన్నారుగా మిత్రురాలిగా వచ్చానన్నమాట''

''ఊ నీతో మాట్లాడి ఎప్పుడు నెగ్గాం కనక'' నఖశిఖ పర్యంతం పరిశీలిస్తూ అంది. మనోజ్ఞకి నవ్వు వస్తోంది. ఆవిడ అయిదుకిలోల బరువున్న పూర్తి జరీ చీర కట్టుకుంది. ఒంటి మీద నగలు మరో అరకిలో బరువుంటాయి. సాదా షిఫాన్ చీర. మెడలో ఓ సన్నటి గొలుసుతప్ప లేనితనని చూసి ఆశ్చర్యపడడంలో ఆశ్చర్యంలేదు.

"ఇదేం విడ్డూరమే తల్లీ. బాగా సంపాదిస్తున్నావట. కారు కూడా కొన్నావట. ఈ అవతారం ఏమిటి?" అడిగింది నిర్మొహమాటంగా. మనోజ్ఞ చిన్నగా నవ్వి ఊరుకుంది. ఆమె దృష్టి పరమేశ్వరం గారిని వదల్లేదు. ఆరాట పడిపోతున్నాడు. వచ్చి మాట్లాడాలని ఆత్రుత. కానీ అటు మాంగల్య ధారణ కాకుండానే వచ్చి పందిట్లో అరవడం బాగోదు కదా.

''మనూ, పెళ్లి చేసుకోవా ఏమిటి? తల్లి తండ్రీ లేనిదానివి. మాతో చెపితే మంచి సంబంధం చూసి దగ్గరుండి పెళ్లి జరిపిస్తాం. మీ బాబాయి కూడా ఎప్పుడూ నీ గురించే దిగులు పడుతుంటారు'' అంది అనసూయ అవకాశం వదులుకోకుండా.

"పెళ్లా. ఎందుకులే పిన్నీ. నాకిలాగే బావుంది."

''అదేం మాట. పెళ్లి చేసుకోకపోతే ఎలాగే? ఎవరూ లేనిదానివి. మా దగ్గరకు రమ్మంటే రావు. నీ కోసం నీకు ఓ తోడు వుండొద్దూ!"

"అలాంటి తోడు నాకు అవసరంలేదు పిన్నీ. ఆరోగ్యంగా వున్నాను. నా పనులు నేనుస్వయంగా చేసుకుంటున్నాను" కవ్విస్తున్నట్లుగా అంది మనోజ్ఞ

"ఇప్పటి సంగతి మాట్లాడకు. వయసులో వున్నావు. రేపు వయసు మళ్లాక ఇంత ఓపికుండదు. నీ వాళ్లంటూ నీకుండాలి. భర్తో, పిల్లలో కాకపోతే మరె

# దయం దీపావళి కథల పోటీలో రూ.200 కన్సొలేషన్ బహుమతి పొందిన కథ

వరు చూస్తారమ్మా''అనునయంగా అంది అనసూయ.

''అది సరేగానీ పిన్నీ. మీ అత్తగారి విషయం ఏమైనా తెలిసిందా?''

ఆవిడ ఖంగుతింది. అంతలోనే ముఖం విచారంగా పెట్టి ''లేదమ్మా. కాశీలో ఏదో మఠంలో చేరిందని తెలిసింది. ఆమాట మాతోనే చెపితే స్వయంగా వెళ్లి సదుపాయంగా వుండే మఠంలో చేర్పించే వాళ్లం. మరీ చాదస్తం. చెప్పకుండా వెళ్లిపోయింది'' రాని కన్నీళ్లను తుడుచుకుంది.

మనోజ్ఞ మరేదో అడగబోయింది. బ్యాండుమేళం నిశ్శబ్దాన్ని [illegible]. మాంగల్యధారణ పూర్తి అయ్యింది. ఓ పెద్ద పళ్లెం నిండా తలంబ్రాలు తెచ్చి వధూవరుల మధ్య పెట్టారు.

కొద్ది రోజులపాటు ఆశ్రయం ఇవ్వమని విధవరాలైన చెల్లెలు ప్రాధేయపడితే, నా వల్లకాదని పట్టెడన్నం కూడా పెట్టకుండా పంపించిన ఘనుడు పెళ్లి కూతురి తండ్రి. కూతురి పెళ్లిలో సరదా కోసం అయిదుకిలోల బియ్యం వృధా చేయడానికి వెనకాడటంలేదు.

''కమలనేం చేశావ్?'' ఎప్పుడొచ్చాడో. పరమేశ్వరం మావయ్య గర్జించినట్లే అరిచాడు. మనోజ్ఞ తలెత్తి అతడి కళ్లల్లోకి నిర్భయంగా, సూటిగా చూసింది.



''కమలను నేను చే[illegible]
కాదు పాతికేళ్లున్నాయి''

''అహో.. ఏం తెలి[illegible]
చేసి నీ అదుపులో పెట్టు[illegible]ల్లదండ్రులని
కూడా చూడ్డానికి రాకుండా ఆంక్ష పెట్టావు''

''బావుంది మావయ్యా. నేనుఆంక్ష పెట్టడమేమిటి? నువ్వేగా నా కూతురివే కావు. నా గుమ్మం తొక్కద్దని వెళ్లగొట్టింది?''

కుటుంబ గౌరవం మంట కలుస్తుంటే కడుపు

అయిన వారిని, కానివారిని కాలదన్ని దుష్ట సాంప్రదాయపు ముసుగులో మూర్ఖంగా జీవించే జడపదార్థాలకి ఓ అతివ చెప్పిన గుణపాఠం!

మండి ఏదో అన్నాను. పెళ్లికి ముహూర్తాలు పెట్టుకున్నాక వద్దని ఇల్లువదిలిపోవడం ఎంత అప్రదిష్ట! మా గురించి ఏమయినా ఆలోచించిందా''

''నిజమే. అది దుర్మార్గురాలు. మరి దానికోసం ఎందుకీ గొడవ? మర్చిపో. అది లేదనుకో'' నవ్వుతూనే అంది మనోజ్ఞ.

''బంధాలు అంత సులభంగా తెగిపోతాయేమిటి? ఇప్పటికయినా దానికి పెళ్లిచేస్తే ఆత్మసంతృప్తి. బాధ్యత తీర్చుకుంటే మనశ్శాంతి''

''పదిహేనేళ్లు దాటినా నీ మాటల్లో మార్పు రాలేదు మావయ్యా. అప్పుడూ ఇదే మాట చెప్పావు. ఇంటర్ ఫస్టుక్లాస్‌లో పాసయి అది మెడిసిన్ చేస్తానంటే వీల్లేదని పెళ్లి నిర్ణయించావు. రెండోసారి బొటా బొటి మార్కులతో పాసయిన బావకి ప్రైవేటు డొనేషన్ కట్టి ఇంజనీరింగ్‌లో చేర్పించావు. ఏమన్నా అంటే అదే బాధ్యత అంటావు. దానికోసం నువ్వు నిర్ణయించిన పెళ్లికొడుకు ప్రస్తుతం ఉద్యోగం లేక అత్తవారింట్లో తిష్ఠ వేశాడు. ఏడేళ్లు ఇంజనీరింగ్ చదివిన బావకు మామూలు ఉద్యోగం దొరికింది. కమల ఇప్పుడు డాక్టరయి తన బ్రతుకు తాను హాయిగా బ్రతుకుతోంది. ఆమె బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఎవరికీ లేదు. నాకు కూడా''

''తల్లి దండ్రులను క్షోభపెట్టి అది సుఖంగా వుండటం నీకు గొప్పగా అనిపిస్తోంది. అక్కా, బావా అదృష్టవంతులు. నీ లాంటి కూతుర్ని కన్నందుకు ఆత్మహత్య చేసుకోవలసిన అవసరం లేకుండా ముందుగానే పోయారు.'' ఛీత్కరించాడు పరమేశ్వరం

మనోజ్ఞ తొణకలేదు.

''అమ్మా, మనూ కమల ఎలాగుందమ్మా'' పార్వతత్తయ్య వచ్చి అడిగింది. ఆవిడ కళ్లల్లో ఆవేదన. భర్త కెదురాడలేని నిస్సహాయత.

''బావుందత్తయ్యా. అమెరికాలో వుంది. క్షేమంగా సుఖంగా, సంతోషంగా వుంది.''

''పోనీలేమ్మా. ఎక్కడో ఒక చోట సుఖంగా వుంటే చాలు'' కన్నీళ్లు తుడుచుకుంది.

# ఈ వారం మాట

## శ్రీ ఓటరు

''నేనలా అనుకోవడంలేదు. నాకు దాని అడ్రస్ కావాలి'' అరిచాడు మావయ్య.

''ఎందుకట?'' అంత తాపీగానూ అడిగింది మనోజ్ఞ.

''ఎందుకేమిటి? హాయిగా పెళ్లి పెటాకులూ లేకుండా అదలా వుండిపోవడం నా కిష్టం లేదు. తండ్రిగా నాబాధ్యత నెరవేర్చుకోవడానికి, కూతురిగా దాని బాధ్యత గుర్తుచేయడానికి''

''కూతురిగా తండ్రిని సంతోషపెట్టాల్సిన బాధ్యత గుర్తుచేస్తున్నావు. బాగానే వుంది మావయ్యా. కొడుగ్గా నీ బాధ్యత తీర్చుకోవాల్సిన అవసరం కూడా వుందిగా. తాతయ్యది అదే మా నాన్నగారి అడ్రస్ వుంది. ఇవ్వనా? అందులో పాపం ఆరోగ్యం కూడా సరిగ్గాలేదు. పక్షవాతంట''

పరమేశ్వరంగారి ముఖం మాడిపోయింది. తండ్రి ఇల్లువదిలివెళ్లిపోయి రెండేళ్లవుతుంది. ఎంతయినా మగవాడు. ఎక్కడో ఓ చోట హాయిగా వుంటాడులే అని ఊరుకున్నాడు.

జవాబు చెప్పలేక ''నీతో మాట్లాడడం నాదే బుద్ధి తక్కువ'' ఛీదరించుకుని వెళ్లిపోయాడు.

''ప్రస్తుతం కమల మా ఇంట్లోనే ఉందత్తయ్యా.

చూడాలనుకుంటే రేపు కారు పంపుతాను. రా'' మనోజ్ఞ పార్వతత్తయ్యతో చెప్పింది.

''నేనూ వస్తానే మనూ'' అనసూయ పిన్ని ఉబలాటంగా అంది.

''అలాగే పిన్నీ. మరీ సంతోషం!'' అనుకున్నట్లే జరుగుతోంది. వీళ్లందరూ ఒక్కసారి తన ఇంటికి రావాలన్నదే మనోజ్ఞ కోరిక.

''హలో. వదినా. బహుకాల దర్శనం'' నవ్వుతూ వచ్చాడు పెళ్లికొడుకు కుమార్ భార్యని కూడా వెంట పెట్టుకుని. ''మా వదిన మనోజ్ఞ. బాగా చదువుకుంది. అంతకంటే బాగా సంపాదిస్తోందని విన్నాను. వివరాలు తెలియవనుకో'' పరిచయం చేశాడు.

''ఎవరికీ ఏమీ తెలియదు కాబట్టే హాయిగా వున్నాను. ఇంతకీ ఎంతకి అమ్మాడు మీ నాన్న''

''అబ్బే అదేంలేదు'' నసిగాడు కుమార్.

''లేకపోవడమేమిటి అక్కయ్యా. ఎనభై వేలు కట్నం. ఇతర లాంఛనాలు మరో పాతికవేలు. పెట్టికొనుక్కున్నాను. ఉద్యోగం మంచిదయితే రేటు పెరిగేదనుకో'' చెప్పింది పెళ్లికూతురు చనువుగా.

పరమేశ్వరం గారికి మంచి గుణపాఠం చెప్పే కోడలే నవ్వుకుంది మనోజ్ఞ.


''అక్కా, బావున్నావా?''ఆప్యాయంగా పలకరిస్తూ వచ్చింది శ్రీలత. ఆమె మనోజ్ఞకి పిన్ని కూతురు.

''ఊ, బాగానే వున్నాను. నువ్వేలా వున్నావు?''

''బావున్నాక్కా! అదిగో అక్కడ కూర్చున్న గళ్ల షర్టాయన మా వారు. ఇద్దరు పిల్లలు. ఒక పాప, ఒక బాబు. అదిగో అక్కడ ఆడుకుంటున్నారు'' గర్వంగా చెప్పింది.

శ్రీలత చూపించిన గళ్ల షర్టాయన కుర్చీలో కాలుమీద కాలువేసుకుని కూర్చుని నిర్లక్ష్యంగా సిగరెట్ తాగుతున్నాడు. ఇతడి లాంటి వాళ్ల మనో విశ్లేషణ చేయాలంటే పరిచయం వుండాల్సిన అవసరం లేదు. మగవాడినన్న అహం, ఎంత చదివినా సంపాదించినా స్త్రీ పురుషుడి కంటే తక్కువేనన్న భావం. ఎదుటివాడు తన కంటే గొప్పవాడైతే పట్టించుకోనట్లు నిర్లక్ష్యం. తక్కువ వాడు కనిపిస్తే గొప్పగా ఫోజుకొట్టే నిర్లక్ష్యం. అతడు భార్యనెంత అదుపులో పెడతాడో అందరికీ తెలిసిన విషయమే. ఆశ్చర్యం ఏమిటంటే శ్రీలత అతడి కంటే ఎక్కువ చదివింది. ఎక్కువ సంపాదిస్తోంది. ఇంటి పనంతా చేస్తుంది. పిల్లలకు చదువు తనే చెప్తుంది. అన్నింటిని మించి ఆయన్ని మగమహారాజులా గౌరవించి పూజిస్తుంది. అయినా అవకాశం దొరికినప్పుడల్లా తన అధికారం పదిమందిలో చూపించుకుంటాడు.

''అమ్మా— నాన్న బావున్నారా లతా? పెళ్లికి రాలేదేం?'' అడిగింది మనోజ్ఞ.



''ఆరోగ్యం బావుండటం లేదటక్కా. ఊళ్లో వున్నారు. వచ్చి నా దగ్గర వుండమంటే రానే రారు' బాధగా అంది శ్రీలత.

వాళ్ళెందుకు రారో మనోజ్ఞకి తెలుసు. అభిమానధనులు.

''లతా'' పిలిచాడామె భర్త. శ్రీలత వెళ్లిపోయింది.

''మనూ నువ్వేనా తల్లీ. నమ్మలేకపోతున్నాను'' అందర్నీ తోసుకుంటూ వచ్చింది కాంతం అత్తయ్య.

''నేనే అత్తయ్యా! బావున్నావా? మామయ్య బావున్నారా?''

''బాగానే వున్నానమ్మా: మీ మామయ్యే నా మీద అలిగి ఎటో వెళ్లిపోయారు. ఊళ్లన్నీ తిరిగి మళ్లీ తిరిగివస్తారులే'' అదేమంత పెద్ద విషయం కాదన్నట్లుగా అంది.

''అమ్మా. ఇక్కడున్నావా? నాకింకా కాఫీ అందలేదు'' అంటూవచ్చాడు కాంతంఅత్తయ్య కొడుకు రామం.

''వస్తున్నా బాబూ. అన్నట్లు మనూని పలకరించావా?''

''ఏం బావా! నీకో పాపనుకుంటాను బావుందా. ఏదీ?'' అడిగింది మనోజ్ఞ.

''అదేం అడుగుతావులే మనూ. మా కోడలికి విడాకులు కావాలని దెబ్బలాడి వెళ్లిపోయింది. పిల్లనీ తీసుకుపోయింది.'' బుడి బుడి దీర్గాలు తీసింది కాంతం అత్తయ్య.

''అలాగా. అయినా పాపని తండ్రికే అప్పగించాలే కోర్టువాళ్లు''

''ఆ ఇచ్చినా మనం ఎందుకు పెంచాలి. మనోవర్తి ఇస్తున్నాం. అదే పెంచుతుంది!'' అత్తయ్యే సమాధానం చెప్పింది. ''అన్నట్లు నువ్వు బాగా సంపాదిస్తున్నావనివిన్నాను. మరి చూస్తే అలా అనిపించడం లేదు. ఇలా తయారయివచ్చావేం?'' ఇలాంటి విషయాలు నిర్మొహమాటంగా అడిగేస్తుందావిడ.

'సంపాదిస్తున్నాగాని అంతా ఇంటికే ఖర్చు అయిపోయిందత్తయ్యా''

''ఇల్లుకూడా కట్టించావా? పెద్దదేనా?'' ఆత్రుతగా అడిగిందావిడ.


''పెద్దదే. వచ్చి చూడరాదూ?'' ఆహ్వానించింది మనోజ్ఞ.

''తప్పకుండా వస్తాం. నీ ఇంటికి బావ కూడా తయారవుతాడు''

''నేనూ వస్తానక్కా'' అంది శ్రీలత.

''అలాగే మీ వారినడిగి అనుమతి తీసుకో''

''ఆయనా వస్తారు. త్వరలో మేమూ ఇల్లుకట్టించుకోబోతున్నాం. చూస్తే మాకూ మంచిది కదా''




''అలాగేనమ్మా. రేపు కారుపంపుతాను. అందరూరండి'' వచ్చిన పని అయిపోవడంతో అందరికీ చెప్పి బయలుదేరింది మనోజ్ఞ.

* *** *

చాలా పెద్ద భవనం అది. అందంగా హుందాగా వుంది. అన్నింటిని మించి కళాత్మకంగా వుంది. రెండు కార్లలో అంతా దిగారు.

పరమేశ్వరం మామయ్య, భార్య పార్వతి, అనసూయ పిన్ని, శ్రీలత కుటుంబం మొత్తం, కాంతం అత్తయ్య, రామం బావా.

మనోజ్ఞ బాగా సంపాదిస్తోందని తెలుసు కానీ మరీ ఇంత ధనవంతురాలనుకోలేదు. అంతా విశాలమైన హాల్లోకి అడుగుపెట్టారు. మనోజ్ఞ చిరునవ్వుతో ఎదురువచ్చి ఆహ్వానించి సోఫాలో కూర్చోబెట్టింది. ఎయిర్‌కండిషన్డు గది కాబోలు ఎక్కడ నుంచో చల్లని గాలి సువాసనతో కూడుకుని వస్తోంది. ప్రాణానికి హాయిగా వుంది.

''కమల ఏదమ్మా?'' పార్వతి అడుగుతుండగా పంజాబీ డ్రస్‌లో అందంగా, ఆరోగ్యంగా వున్న కమల వచ్చి తల్లిని కౌగలించుకుంది.

''బావున్నావా కమలా?'' ఆప్యాయంగా దగ్గరకు తీసుకుందావిడ.

''బాగానే ఉన్నానమ్మా. మీరంతా బావున్నారా'' తండ్రిని తప్ప అందర్నీ పేరుపేరునా పలకరించింది కమల. పరమేశ్వరం గారికి కోపం ముంచుకొస్తోంది.

''చాలా బావున్నావని తెలుస్తోంది. అమెరికాలో కూడా ఒంటరిగానే ఉంటున్నావా?, ఎవరూ లేని అనాథకి మల్లే? అడిగాడు కోపంగా. కమల చిన్నగా నవ్వి ఊరుకుంది.

''అడిగితే అమ్మని పంపించనన్నావా?'' రెట్టించి అడిగాడు.

''ఆ తర్వాత మీరు కూడా వెళ్లేవారు కదూ మామయ్యా'' ఆయన విషయం తెలిసిన మనోజ్ఞ అంది అది అమెరికా మోజు. ''అయినా కమల అక్కడ ఒంటరిగా వుండడం లేదులే మామయ్యా''

''మనోజ్'' పిలిచింది కమల. మూడేళ్ల బాబు వచ్చాడు. అందంగా, బొద్దుగా వున్నాడు. రావడమే అందరికీ నమస్కారం చేసి సోఫాలో ఒక పక్క కూర్చున్నాడు.

''ఎంత బావున్నాడే బాబు ఎవరమ్మా'' అనసూయ అడిగింది.

''కమలకొడుకు పిన్నీ' పక్కలో బాంబుపడ్డట్టు ఉలిక్కిపడ్డారంతా.

''కమల కొడుకేమిటి పెళ్లి కాకుండానే''

''రజాక్ ఇలా రండి'' పిలిచింది మనోజ్ఞ. గదిలోంచి ఆరడగుల ఎత్తు ఉన్న ఒక వ్యక్తి బయటకువచ్చాడు.

''అందరికీ నమస్కారం'' వినయంగా చెప్పి బాబుదగ్గర కూర్చున్నాడు.

''ఇతడు మన కమల భర్త రజాక్. అతడు కూడా డాక్టరే. ఇద్దరూ అమెరికాలో మంచి ఉద్యోగాల్లో వున్నారు.'' చెప్పింది మనోజ్ఞ.

''ఏమిటి. ముస్లింనా చేసుకుంది? ఇంకెవరూ దొరకలా?'' పరమేశ్వరంగారు గట్టిగా అరిచారు. కోపంతో లేచి నిలబడ్డారు.

''మీ కిప్పుడు హిందూ, ముస్లిం అన్న మతాలు లేవు మామయ్యగారూ.. ఇద్దరం ఒకటే జాతి, మానవజాతి'' నవ్వుతూ జవాబిచ్చాడు రజాక్.

''ఇక్కడ ఇంకో క్షణం వుండొద్దు. పదండి పోదాం'' పరమేశ్వరం గారి మాటలు వినిపించనట్లు ఎవరూ కదల్లేదు.

''ఇంతదూరం వచ్చారు. నా కుటుంబంలో అందర్నీ కలుసుకుని వెళ్లండి మామయ్యా'' అంది మనోజ్ఞ.

''అంటే నువ్వు క్రిస్టియన్‌ని కట్టుకున్నావేమిటి''

''కుటుంబం అంటే భర్తా, పిల్లలూ మాత్రమే కాదులే మామయ్యా. మా తాతగారున్నారు. ఇం

# రచయిత్రి పరిచయం

పూర్తిపేరు వల్లభు విజయలక్ష్మి . పుట్టిందీ పెరిగిందీ, హైదరాబాద్‌లోనే.వివాహం అయింది. ఒక కుమార్తె.చదువు రాజకీయ శాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ. ఉద్యోగం స్టేట్‌బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్, సికింద్రాబాద్ బ్రాంచిలో. హాబీలు: పుస్తకపఠనం, నిట్టింగ్, ఫొటోగ్రఫీ.



వయస్సు నాలుగు పదులు దాటినా కలం పట్టి అయిదేళ్లుకూడా కాలేదు. నన్ను ప్రోత్సహించి కలం పట్టించిన వారు శ్రీ యండమూరి వీరేంద్రనాథ్ గారు . ఆయనకు గౌరవనీయ సెక్రటరీగా అయిదేళ్ల అనుభవం ఉన్నా రచనలోని మెలకువలు పూర్తి తెలుసుకోలేక పోవడానికి నా నిర్లక్ష్యమే కారణం. ఆయనకు కృతజ్ఞతలు చెప్పేందుకు తగిన భాషయినాఅలవడ దింకా.

మొదటిరచన 'నిశీధి విహంగం' స్రవంతిలో సీరియల్‌గా వచ్చింది. వ్రాసేది కొంచెమే అయినా ఆలోచింపచేసేదిగా ఉండాలని ఆకాంక్ష. ముఖ్యంగా స్త్రీల సమస్యల గురించి వ్రాయాలని ఉబలాటం.

నా రచనకు బహుమతినిచ్చి ప్రోత్సహించిన శ్రీ పురాణం సుబ్రహ్మణ్యశర్మ గారికీ,ఉదయం నవతరం వారపత్రికకు నాకృతజ్ఞతలు.

విజయలక్ష్మి, హైదరాబాద్

---

కా కావలసిన వాళ్లున్నారు చూడండి''

రజాక్ వెళ్లి చక్రాల కుర్చీ తోసుకుంటూ వచ్చాడు. అందులో వున్నది రామకృష్ణగారు. పరమేశ్వరం, అనసూయలకు కన్నతండ్రి.

''నాన్నా'' దిగ్గున లేచి దగ్గరగా వెళ్లింది అనసూయ. ''ఇక్కడున్నావా నాన్నా'' ఆమెకు దుఃఖం ముంచుకొస్తోంది. పరమేశ్వరంగారు మాత్రం నిశ్చేష్టులై నిలబడిపోయారు.

''అవునమ్మా. ఈ దేవాలయంలోనే వున్నాను. కొడుకులయితేనే తలకి కొరివి పెడతారని నమ్మి వున్నదంతా ఊడ్చి వాళ్లకే పెట్టాను. పెన్షన్‌కూడా అమ్మి మరీ ఇచ్చాను. అంతా తీసుకుని నేను భారం అయిపోయానని రెండోవాడి దగ్గరకు తరిమేశాడు పెద్దవాడు.

అంతా అన్నకే పెట్టావు. ఇప్పుడు నేనెందుకు నిన్ను పోషించాలి. అక్కడికే పో అన్నాడు వాడు. ఎక్కడా వుండలేక ఓ స్నేహితుడి దగ్గరకు చేరుకున్నాను. మనోజ్ఞ మన విషయాలన్నీకనిపెడుతూనేవుంది. వచ్చి బతిమాలి ఇక్కడకు తీసుకొచ్చింది. మంచి మందులు ఇప్పించింది. ఇప్పుడీ మాత్రం ఉన్నానంటే దాని వలనే'' ఆయన కంట నీరు తిరిగింది.

''అలా అనకు తాతయ్యా. తల్లీ తండ్రీ లేని దాన్నని అందరినీ ఎదిరించి నాకు స్కూల్ ఫైనల్ దాకా చెప్పించావ్. ఆ పునాది లేకపోతే నాకీ చదువు, సామర్థ్యం వచ్చేవేకావు. ఆనాడు నా బాధ్యత తీసుకున్నావు. ఈ రోజు నీ బాధ్యత నేను తీసుకున్నానంతే''

'నీ కోసం నేను చేసింది ఎంతమ్మా వీళ్ల కోసం మంచి బట్టలయినా కట్టకుండా జమ చేసి డిగ్రీలు చదివించాను. పెళ్ళిళ్లయినా, పిల్లలు పుట్టినా నా సంపాదన మొత్తం వాళ్లకే ఇచ్చాను. వాళ్లకు లేని బాధ్యత నీకెక్కడ వచ్చిందమ్మా''

''పోనీ నా దగ్గరకు రాలేకపోయావా నాన్నా'' అనసూయ ఏడుస్తూనే అంది.

''నీ దగ్గరకెందుకు వస్తాను? దేవతలాంటి అత్తగారిని నానా హింసలు పెట్టావు. ఒక్కగానొక్క కొడుకుని అపురూపంగా పెంచుకుందే. ఆవిడకు జబ్బుచేస్తే పరిచర్య చేయడానికి కూడా ఇష్టపడక హాస్పిటల్లో చేర్పించి కనీసం తిరిగయినా చూడలేదు. ఆసుపత్రి వాళ్ళిచ్చిన బ్రెడ్డూ, పళ్ళూ తినలేక అంత జబ్బులోనూ నస్తులుంది. కొద్దిగా నయం అయ్యాక డిశ్చార్జి చేస్తే ఇంటికి రాకుండా కాశీ వెళ్లి ప్రాణత్యాగం చేద్దామనుకుంది. రైల్వే స్టేషన్‌లో మనోజ్ఞకి కనిపిస్తే ఇక్కడకు తీసుకొచ్చింది తెలుసా?''

తండ్రిమాటలకు అనసూయ సమాధానం చెప్పలేదు. గదిలోంచి రెండేళ్ల పాపని ఎత్తుకుని వచ్చిన అత్తగార్ని చూసి సిగ్గుతో తలదించుకుంది.

''అత్తయ్యా. నన్ను క్షమించండి. ఇంటికివెళ్దాం రండి'' అంది మెల్లిగా.

''ఇల్లా! ఇదే నాకు ఇల్లు. ఇప్పుడు ఆత్మహత్య చేసుకోవాలని, అసలు చచ్చిపోవాలనికూడా లేదు. ఇక్కడ పదిమందికీ అన్నీ చేసి పెడుతూ వందేళ్లు బతకాలని వుంది'' అందావిడ.

''ఇంతకీ ఈ పాపెవరు'' అడిగింది పార్వతి.

''నాకో బుల్లితోడు. ఏం బావా గుర్తుపట్టావా'' అడిగింది మనోజ్ఞ.

''ఎవరు? తెలియడం లేదు'' అనుమానంగానే అడిగాడు రామం.

''అవునుబావా. నీకు నీ అమ్మతప్ప ఎవరూ తెలియదు. కట్టుకున్న భార్య, కన్న బిడ్డా కూడా. కట్న కానుకలతో, లాంఛనాలతో భార్య రావాలని అన్నీ ఇవ్వగలిగిన అమ్మాయినే చేసుకున్నావు. తర్వాత ఆమెకు చదువు ఎక్కువలేదని, ఉద్యోగంలేదని రాచి రంపాన పెట్టారు. పుట్టింటి నుంచి ఇంకా, ఇంకా తెమ్మన్నారు. సాధ్యమయినంతవరకు తెచ్చింది. కూతురు పుట్టిందనగానే పుట్టింటి నుంచి తీసుకురాకుండా వదిలించుకుందామనుకున్నారు. మళ్లీ పెళ్లి చేసుకోవాలంటే అమ్మాయి ప్రతి బంధకం



కాబట్టి మనోహర్తి ఇష్టా విడాకులు తీసుకున్నారు. పోనీ రెండి శాంతకి మంచే జరిగింది. ఇప్పుడు డిగ్రీకి కదులుతోంది. త్వరలో నా కంపెనీలోనే ఉద్యోగం కూడా వేయిస్తాను. సుఖంగా బ్రతుకుతుంది.

రామం సిగ్గుగా తలదించుకున్నాడు.

"పాపం అత్తయ్య ఆశ పెట్టుకుంది. బాగా సంపాదిస్తున్నావని, ఎట్లాగూ వయసు ముప్పయిదాటింది కాబట్టి అడగ్గానే ఒప్పుకుంటావనీ అనుకుంది. చూడత్తయ్యా, నేను కావాలనుకుంటే మంచి ఉద్యోగస్థుడూ, సంస్కారవంతుడే దొరుకుతాడు. ఇలాంటి సిరికి నెధవ అవసరంలేదు. అన్నట్లు అత్తయ్యా, మామయ్య కూడా ఇక్కడే వున్నారు. మనవరాలితో ఆడుకుంటూ, కోడల్నే కూతురుగా చూసుకుంటూ హాయిగా వున్నారు.

నీ మొహం చూడడానికి కూడా ఇష్టపడడం లేదనుకో."

కాంతం అత్తయ్య ముఖంలో నెత్తురు చుక్క లేదు. ఇంటికి ఆహ్వానించిందంటే అన్నింటికీ ఇష్టపడి వస్తే అనుకుంటూ సంతోషంగా వచ్చింది. ఇలాంటి దెబ్బ తగులుతుందనుకోలేదు.

"ఇవన్నీ చూస్తుంటే కంపరంగా ఉందక్కా. వీళ్లసలు మనుషులే నంటారా?" అప్పటికి నోరు విప్పింది శ్రీలత.


"వాళ్లలో నిన్నుకూడా కలుపుకో లతా. నువ్వు మాత్రం చేసిందేమిటి? ఒక్కగా నొక్క కూతురివి. మునలితనంలోవున్న తల్లిదండ్రులను నువ్వెంత పట్టించుకుంటున్నావు"

'నేనేం చేయనక్కయ్యా! అత్తవారింట్లో వున్నాను అసహాయురాలిని"

"నీ భర్తకీ, అత్తగారికి మీ అమ్మా నాన్నంటే పడదు. ఇంటికొస్తే ఓ కప్పుకాఫీ అయినా ఇవ్వకుండా పంపగలరు. అదే నీ పతివ్రతా ధర్మం అని నువ్వు పొంగి పోతున్నావు. అతడు తల్లి దండ్రులకి ఒక్కడే కొడుకు. నువ్వు మా అమ్మా నాన్నలకి ఒక్కతే కూతురివి. వాళ్లబ్బాయిని వాళ్ళెలా చదివించారో నిన్ను నీ వాళ్లూ చదివించారు. ఉద్యోగం వేయించారు. పెళ్లికి బోలెడు ఖర్చుపెట్టి అన్నీ ఇచ్చారు. అతడికి తన తల్లి బాధ్యత ఎంతుందో, నీకు నీ తల్లి దండ్రుల బాధ్యత అంతే వుంది."

"నిజమేనక్కా. కాని అమ్మా వాళ్లు వస్తే ఓ పూట భోజనం కూడా పెట్టనివ్వదు అత్తగారు. ఏమన్నా అంటే ఇద్దరూ కలిసి నన్ను నానా మాటలూ అంటారు. అమ్మా, నాన్నలని నా ఎదుటే తిడతారు"

"మీ పక్కింటావిడ మీ అత్తగారితో పోట్లాటకు వస్తే పెద్ద నోరేసుకువెళ్లి వాళ్ల తరఫున వాదిస్తావే. ఇంట్లో నీ నోరేమయిపోతుంది! లతా నీకు ఆ




ఇంట్లో బాధ్యతతో పాటు హక్కుకూడా వుంది. అతడి తల్లిని శాశ్వతంగా పోషించాలనుకుంటున్న నువ్వు నీ తల్లితండ్రుల పట్ల కర్తవ్యం పాలించడం ఒకరి అనుమతితో చేయాల్సింది కాదు. అది నీ స్వంత హక్కు. బాధ్యత. నీలాంటి స్త్రీలలో మార్పు రావాలి. మీ భావాల్లో మార్పురావాలి. అత్తవారిల్లు స్వంతం. పుట్టిల్లు పరాయిది అనే ఆలోచన పోవాలి"

శ్రీలత మాట్లాడలేదు. లోపల నుంచి ఆమె తల్లిదండ్రులు బయటకొచ్చారు. వాళ్లని చూసి స్థాణువై పోయింది శ్రీలత.

"అమ్మా. మీరు ఇక్కడ?"

"అవునమ్మా.. ఈ ఇంటికి అప్పుడప్పుడు వచ్చే అతిధులం మేము. ఆరోగ్యం బాగా లేనప్పుడల్లా వస్తాం. మనోజ్ఞ పెట్టిన భిక్ష ఇది. కన్నబిడ్డ వుండీ అనాథలమైనమాకు అనాథ అయినా అన్నివిధాలా అండగా వుంటోంది ఆ పిల్ల" అన్నాడు లత తండ్రి.

"అలా మాట్లాడకండి బాబాయిగారూ. నేను అనాథనని ఎప్పుడూ అనుకోలేదు." మనోజ్ఞ అందరినీ ఉద్దేశించి అంది "కేవలం భర్తా లేక భార్యా, పిల్లలూ మాత్రమే కుటుంబం అని మిగిలిన వాళ్లంతా పరాయి వాళ్లనే సంకుచితత్వం మనలో పోవాలి. పెళ్ళయిన అమ్మాయికి తల్లీ, తండ్రీ పరాయివాళ్ళు కోడలికి అత్త శత్రువు, అత్తకి కోడలు శత్రువు, సంపాదన లేని తండ్రి కొడుక్కి బరువు, డబ్బూ, ఆస్తి లేని భార్య భర్తకి అవసరంలేదు. మరో పెళ్లి చేసుకోవడానికి అడ్డు కాబట్టి తండ్రికి కన్న బిడ్డ కూడా అవసరంలేదు. చేస్తున్నది తప్పు అంటే భర్తనయినా ఎదిరించి వెళ్లగొట్టే సాధ్వీమణులు. మీలో ఎవరెక్కువ తప్పుచేశారని నేను విశ్లేషించ దంలేదు. అంతరాత్మ అనేది వుంటే అదే మీకు సమాధానం చెప్పాలి. కాని మన సంస్కృతి సాంప్రదాయాల గురించి ఎవరి దగ్గరా మాట్లాడకండి. పెళ్లి ఒక్కటే జీవితధ్యేయమని ఉపన్యాసాలు ఇవ్వకండి. మీ కుటుంబంలోనే ఐక్యత లేనప్పుడు దేశం

గురించి మాట్లాడకండి. మా ఈ ఇల్లు ఒక దేవాలయం. ఇక్కడ జాతి, మత వివక్షణ లేదు. ఒకరికొకరు తెలియనివాళ్లు కూడా బంధువులే. ఆత్మీయులే."

"అంటే ఈ బంధువులు కాకుండా వేరే వాళ్లు ఉన్నారా" రామం అడిగాడు.

"చాలామంది వున్నారు. ఈ ఇల్లు ఒక పవిత్ర దేవాలయం. ఏ దేవుడినీ ప్రతిష్టించని దేవాలయం. లోపల చూస్తే ఒక పక్క అనుసత్రి, మరో పక్క పిల్లల కోసం అందమైన విద్యాలయం కనిపిస్తుంది. ఇక్కడ పిల్లలకు వ్యక్తిత్వవికాసం నేర్పించ బడుతుంది. హక్కులతో పాటు బాధ్యతలు నేర్పబడతాయి. కుల మత భాషా భేదాలు లేవిక్కడ. అందరూ ఒకరి కొకరు ఆత్మీయులే. ఇక్కడ తోటలో పువ్వులు మానవత్వమనే పరిమళాన్ని వెదజల్లుతాయి. గాలికూడా మానవత్వాన్ని మూటకట్టుకుని వీస్తుంది. కాబట్టే అందరినీ ఆరోగ్యం వరిస్తుంది. కలిసి కట్టుగా అందరూ తమకు చేతనయిన పని చేస్తారు. ప్రతి వాళ్లూ ఒకరికి చేయూతనిచ్చే స్థితిలో వుంటారే తప్ప చేయి చాచి యాచించే స్థితిలో వుండరు. ఈ దేవాలయానికి స్ఫూర్తి మనోజ్ఞ అని వేరే చెప్పనక్కరలేదు. అరవైఏళ్ల జీవితంలో ఎంతో మంది దగ్గర ఎన్నో నేర్చుకున్న విద్య అత్యున్నత మైందే అన్నారు రామకృష్ణగారు.

"అక్కా, నేనోసారి లోపల చూడవచ్చా" అడిగింది శ్రీలత.

"క్షమించాలి. ఈ దేవాలయం లోకి మీకు ప్రవేశంలేదు. మీ అందర్నీ ఇంటికి పిలిచి మంచి నీళ్లయినా ఇవ్వకుండా పంపుతున్నందుకు బాధగా లేదు. ఇక్కడ నీళ్లు తాగడానికయినా మీకు అర్హత లేదు. ఇప్పటికే మీ కోసం మా అమూల్యమైన సమయాన్ని వృధా చేసుకున్నాం. వెళ్లండి. బస్‌స్టాప్ కూడా దగ్గర్లోనేవుంది." మరోసారి వెనక్కి తిరిగి చూడకుండా లోపలకు వెళ్లిపోయింది మనోజ్ఞ.